## క్లుప్తంగా

### టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



మంగళగిరి: రెడిమేడ్ వస్త్రాల రాకతో టైలర్స్‌కు ఉపాధి మార్గం తగ్గిపోయిందని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఆదుకోవాలని టైలర్స్ అసోషియేషన్ ప్రతినిధులు కోరారు. ఆదివారం పట్టణంలోని ఓ హోటల్‌లో టైలర్స్ అసోషియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోషియేషన్ ప్రెసిడెంట్‌గా షేక్ నాగుల్ మీరా, ప్రధాన కార్యదర్శిగా జంజనం వెంకట సాంబశివరావు, కార్యవర్గ సభ్యులుగా భావన్నారాయణ, సుబ్రమణ్యం, భాస్కర్, అంజయ్య, అలీ, ఆంజనేయులు, షేక్ అన్వర్‌ను ఎన్నుకున్నారు. అషోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం టైలర్స్‌ను ఆదుకుని, వారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: పట్టణంలోని బాపిస్ట్‌పేట, ఆంజనేయ కాలనీ, వీవర్స్ కాలనీ, తెనాలి ఫ్లై ఓవర్ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఎ.సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా జరుగుతున్న వినియోగదారులు గమనించాలని కోరారు.

### మాజీ సీఎం ఇంటిపై దాడి సరికాదు

మంగళగిరి: తిరుపతి లడ్డూ వివాదంలో బీజేపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటిని ముట్టడించడం సరికాదని వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్ ఖండించారు. ఆదివారం రాజేష్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు తిరుపతి లడ్డూని వివాదం చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడిచినా.. ఎన్నికల హామీలను నెరవేర్చని ముఖ్యమంత్రి చంద్రబాబును నిలదీయలేని బీజేపీ నేతలు మాజీ సీఎం ఇల్లు ముట్టడించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నాయకులకు దమ్ముంటే ఎన్నికల హామీలు నెరవేర్చేలా చంద్రబాబుపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

### పారిశుద్ధ్య కార్యక్రమాలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో కమిషనర్ అలీమ్ బాషా ఆదేశాల మేరకు కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రధాన రహదారులలో చెత్తాచెదారాన్ని తొలగించారు. దోమల నివారణ కోసం పలు డ్రెయినేజీల్లో దోమల మందు కొట్టి, బ్లీచింగ్ చల్లారు. విద్యుత్, నీరు ఆదాతో పాటు ప్లాస్టిక్ నిషేధంపై అవగాన కల్పించారు. తాగునీరు పరిశుభ్రంగా ఉండేందుకు వాటర్ ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### సబ్ రిజిస్ట్రార్ బదిలీ

మంగళగిరి: మంగళగిరి సబ్‌రిజిస్ట్రార్ బదిలీ అయ్యారు. సబ్ రిజిస్ట్రార్ షిరిల్ బాబు గుంటూరు సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ కాగా ఆయన స్థానంలో తెనాలి సబ్ రిజిస్ట్రార్ బాలగురవయ్య మంగళగిరి బదిలీ అయ్యారు.

### అర్చక సంఘ అభివృద్ధికి కృషి



ఫిరంగిపురం: అర్చక సంఘ అభివృద్ధికి కృషి చేయాలని పల్నాడు జిల్లా సత్తెనపల్లి డివిజన్ అర్చక సంఘ నాయకుడు వి.రాజాభార్గవనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి కల్యాణ మండపంలో మండల బ్రాహ్మణ అర్చక సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. సంఘ సభ్యులు ఐకమత్యంగా ఉండి పలు అంశాలపై చర్చించి, మంచి నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. అంతేకాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న అర్చకులను సంఘం తరుపున ఆదుకోవాలని సూచించారు. వృత్తిపరంగా ఎటువంటి సమస్యలు వచ్చిన సంఘం దృష్టికి తీసుకువస్తే వాటిని సమన్వయంతో పరిష్కరించుకోవాలని చెప్పారు. అనంతరం ధూపదీప నైవేద్యం పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నారాయణం ప్రసాదాచార్యులు, అధ్యక్షుడు దీవి. వరప్రసన్నమూర్తి, కార్యదర్శి రావూరి పూర్ణానందశాస్త్రి, పలు గ్రామాల అర్చకులు పాల్గొన్నారు.

# వైఫల్యాలను కప్పిపుచ్చుకునే దుశ్చర్యలు

- మాజీ సీఎం క్యాంపు ఆఫీసుపై దాడిని ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు
- వంద రోజుల పరిపాలన వైఫల్యాలను పక్కదోవ పట్టించేందుకంటూ ఆగ్రహం
- తిరుమల లడ్డూ వివాదంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్

తాడేపల్లిరూరల్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇల్లు, వైఎస్సార్ సీపీ కార్యాలయంపై బీజేపీ గూండాలు దాడి చేసిన ఘటనను వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం తీవ్రంగా ఖండించారు.

### వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నివాసం, పార్టీ కార్యాలయంపై సీఎం చంద్రబాబు నాయుడు తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వంలో భాగమైన బీజేపీ నాయకులతో దాడులు చేయిస్తున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఇతర విషయాలను ప్రజలు చర్చించుకోకుండా ఉండేందుకు తిరుపతి లడ్డూను తెరపైకి తీసుకొచ్చారు. దాడులను చూస్తూ ఉరుకోం, ప్రతిఘటిస్తాం. దేనికైనా సిద్ధమే.

– డి.వేమారెడ్డి, ఎంటీఎంసీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ

### దాడులు సహించం.. నిజాలు నిగ్గుతేల్చండి



బీజేపీ నాయకులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దూషించడం, పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి చేయడం దుర్మార్గం. ఇలాంటి చర్యలకు పాల్పడితే వైఎస్సార్ సీపీ శ్రేణులు చూస్తూ ఊరుకోరు. తిరుమల లడ్డూ వివాదంపై విచారణ జరిపి, నిజాలు నిగ్గుతేల్చాలి. ఆధారాలు లేకుండా దాడులకు ప్రేరేపించే విధంగా చేయడం సరికాదు.

– ఈపూరి ఆదాం, సీనియర్ నాయకులు, వైఎస్సార్ సీపీ

### దాడులను సహించేది లేదు



మాజీ సీఎం వైఎస్ జగన్ ఇంటిపై బీజేపీ నాయకుల దాడులు మంచిది కాదు. తిరుమల లడ్డూ విషయంలో ఏం జరుగుతుందో వారి మనస్సాక్షికి తెలుసు. నిజంగా కల్తీ జరిగితే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు టీటీడీ బోర్డు సభ్యులు, అధికారులు ఈ విషయాన్ని ఎందుకు బయట పెట్టలేదు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు బయటకు రాకుండా ఉండేందుకు ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారు. మరోసారి ఇలాంటి దాడులను సహించేది లేదు.

–బి.వేణుగోపాల సోమిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ.

### కుటిల రాజకీయాలు



కుటిల రాజకీయాల కోసం దుర్మార్గమైన ఆరోపణలు చేసిన సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. తిరుమల లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి ఎప్పుడు కొనుగోలు చేశారు? ఎప్పుడు నాణ్యతా పరీక్షలు జరిపారు? అన్న విషయం స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ గత ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం చంద్రబాబుకే చెల్లింది. బీజేపీ నేతలు పార్టీ స్థాయిని మరింత దిగజారుస్తూ దాడులకు పాల్పడుతున్నారు.

– మేకతోటి అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు, దుగ్గిరాల.

### హామీలను నెరవేర్చలేక దాడులు



సీఎం చంద్రబాబు హామీలను నెరవేర్చలేక శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూ నాణ్యతపై చేసిన వ్యాఖ్యలు క్షమించరానివి. దీనిని అడ్డు పెట్టుకుని ఎన్డీఏ ప్రభుత్వం ముసుగులో కొంతమంది దుండగులు మాజీ సీఎం వైఎస్ జగన్ ఇంటిపై దాడి చేయడం సిగ్గుచేటు. రాష్ట్ర సంక్షేమాన్ని మరచి ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి సమాజంలో అలజడి సృష్టించడం న్యాయమా?

– ముదిగొండ ప్రకాష్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ

# తక్కువ స్థలంలో నిరంతర ఆదాయం

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ఏటీఎం మోడల్( ఎనీటైం మనీ మోడల్) పద్ధతిలో ఆరోగ్యంతో పాటు నిరంతర ఆదాయం ప్రకృతి వ్యవసాయం ద్వారా పొందడం గురించి ఆదివారం రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తక్కువ స్థలంలో ఎక్కువ రకాలు పంటలు పండించడం గురించి వివరించారు. 20 సెంట్లు స్థలంలో నీటి వసతి చూసుకొని దుక్కిదున్ని దానిని ప్రతి నాలుగు అడుగులకు ఒక బెడ్డుగా చేసుకోవాలన్నారు, ఒక్కో బెడ్డులో బీజామృతంతో విత్తన శుద్ధి చేసిన క్యారెట్, బీట్రూట్, ముల్లంగి వంటివి పెట్టుకోవాలని చెప్పారు. వాటి మధ్యనున్న ఖాళీలో మొక్కజొన్న నాటుకోవాలన్నారు. కాలువ అంచుల మధ్యలో వంగ, బెండ, టమాట వంటివి చల్లుకోవాలని సూచించారు. ఇలా ఏర్పాటు చేసుకున్న 15 రోజుల నుంచి పంట చేతికొచ్చి ఆదాయం వస్తుందని వివరించారు. అనంతరం రైతు పొలంలో కొన్ని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్స్ ఇ. వెంకటేశ్వర్లు, ఎం.అన్నామణి, వరలక్ష్మి, తిరుపతిరావు, లక్ష్మారెడ్డి, అరుణ, అమల, ప్రభావతి, కృష్ణవేణి, గాయత్రి రైతులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

# తెలుగు సాహిత్యాభివృద్ధికి జాషువా కృషి

ఫిరంగిపురం: తెలుగు సాహిత్యానికి గుర్రం జాషువా చేసిన కృషి ఎనలేనిదని కొండవీటి రచయితల సంఘం అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ రఫీ అన్నారు. మండల కేంద్రంలోని రూరల్ క్రిస్టియన్ జూనియర్ కళాశాలలో ఆదివారం గుర్రం జాషువా 129వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సయ్యద్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా అని అన్నారు. ఆయన రచనలు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రాచుర్యం పొందాయన్నారు. అనంతరం గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పద్య సాహిత్యంలో విశేష ప్రతిభ కనపరిచిన కవులు ఎంఎఫ్ జోసఫ్, విప్పర్ల శౌరీలు, దుబ్బుల దాసు, రాయప్రోలు జగదీష్ చంద్రశర్మ, షేక్.ఖాజావలిలకు బిరుదులు ఇచ్చి అవార్డులతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి తోళ్లమడుగు గోవిందయ్య, కళాశాల ప్రిన్సిపల్ ఎండీ సుదర్శన్ పాల్గొన్నారు.



పద్యకవులను సన్మానిస్తున్న కొండవీటి రచయితల సంఘం సభ్యులు

# చిలువూరులో ఉచిత మెడికల్ క్యాంపు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరులో ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రైటర్ ఏమ్మూర్తి సురేష్ ఆధ్వర్యంలో విడిచింతపాల్ సొసైటీ సభ్యుల సహకారంతో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా చిలువూరు గ్రామ సర్పంచ్ చిలుకూరి మాణిక్యమ్మ పాల్గొని, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ వైద్యశిబిరంలో తెనాలి డాక్టర్లు ఉప్పలపు పావని ప్రియాంక, హ్యాపి హాస్పిటల్ చిన్నపిల్లల వైద్య నిపుణులు అరుణ్ తేజ, చెవి ముక్కు గొంతు నిపుణులు సింధూర, సీజనల్ జ్వరాలు, డెంగీ, దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులకు సంబంధించిన పరీక్షలను ఉచితంగా నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం డాక్టర్ పావని ప్రియాంక ఐదుగురు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విల్ శెట్టిపల్లి సొసైటీ జిల్లా అధ్యక్షులు కె.జయరాజ్, చంద్రశేఖర్, రవిచంద్ర, చిలుకూరు విడిచింతపాల్ సొసైటీ అధ్యక్షుడు ముసలయ్య, జి.చంటి, ఇందుపల్లి రామారావు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

# ప్రజలకు చేరువగా ప్రభుత్వ పథకాలు

ఫిరంగిపురం: ప్రజలకు చేరువగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ వందరోజుల పాలనపై ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్నా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా కొత్తపేటలో వందరోజుల పాలనపై కరపత్రాలు ప్రజలకు ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అందజేశారు. మండవ చిన నరసింహారావు, కె.కోటేశ్వరరావు, జి.చంద్రం, పి.థామాసు, పి.లూర్దమ్మ, టి. కేశవరావు, వి.హరిబాబు, విజయశేఖర్, ఇన్‌చార్జి తహసీల్దారు రాజారమేష్ మోహన్, ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మల లక్ష్మీకుమారి, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి. శ్రావణ్‌కుమార్

# రేపు కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతి


తెనాలి: భారతీయ తత్వశాస్త్రంలో విశేష కృషి చేసిన తెనాలికి చెందిన సుప్రసిద్ధ తత్వశాస్త్రవేత్త పద్మ విభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతిని ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన వివేక ఎడ్యుకేషనల్ సొసైటీ, తెనాలి ఇంప్రెషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుక ఆహ్వాన పత్రికను ఆదివారం సాయంత్రం వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు ఆవిష్కరించారు. అనంతరం వివరాలను తెలియజేశారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని థియేటరులో జరిగే శతజయంతి సభకు డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు అధ్యక్షత వహిస్తారు. తెనాలి ఇంప్రెషన్స్ రూపొందించిన 'పద్మవిభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి' పుస్తకాన్ని కవి, రచయిత, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ విశ్రాంత సంచాలకుడు వాడ్రేవు చినవీరభద్రుడు ఆవిష్కరిస్తారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, ప్రజాసాహితి మాసపత్రిక ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు విశిష్ట అతిథులుగా హాజరవుతారని తెలిపారు. తత్వశాస్త్రాన్ని సామాన్యులకు అర్థమయేలా కృషిచేసిన సచ్చిదానందమూర్తి, భారత నాగరికత, చరిత్ర, సాంఘిక అంశాలతో పాటు హిందూ ధర్మ శాస్త్రాలు, మెటాఫిజిక్స్, ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీలపై ఇంగ్లిష్‌లో 30పైగా, తెలుగులో 12కు పైగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన గ్రంథాలను రచించినట్టు వీరనారాయణరావు తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించినట్టు వివరించారు. కార్యక్రమంలో మురళి, కె.రిషిత, పి.మొనాలి పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న వీరనారాయణ, రామరాజు

# ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు

తెనాలి రూరల్: పట్టణ మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సంఘ కాపరి బిషప్ పినపాటి జాన్‌పాల్ సహకారంతో గంగానమ్మపేటకు చెందిన శ్రీలక్ష్మి విజన్‌కేర్ సెంటర్ వైద్యులు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 150 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 50 మందికి కళ్లజోళ్లు, 100 మందికి మందులను ఉచితంగా అందజేశారు. త్వరలో 10 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్సలను ఉచితంగా చేయనున్నట్టు విజన్ కేర్ సెంటర్ నిర్వాహకుడు డాక్టర్ భాస్కరరావు తెలిపారు. తమ వైద్యశాల ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా రాక్ గాస్పెల్ చర్చిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమాన్ని చర్చి సంఘ పెద్దలు పినపాటి డేవిడ్ రాజు, ఈవూరి శ్రీనివాసరావు, కసుకుర్తి భాస్కరరావు, జైరాజు, ఈవూరి ఏసురత్నం, పినపాటి ఫ్రాన్సిస్, కతెవరపు ఏసుదాస్ పర్యవేక్షించారు.



పరీక్షలు చేస్తున్న డాక్టర్ భాస్కరరావు

### ప్రజ్ఞాచారికి సేవా పురస్కారం

తెనాలి రూరల్: కొలకలూరుకు చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి జాతీయ సాహితీ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. షిర్డీ సాయినాథుని 189వ జయంతిని పురస్కరించుకుని చిలకలూరిపేటకు చెందిన జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయి మహానుభావా సాహితీ సేవ జాతీయ పురస్కారాన్ని అందించనున్నారు. దశాబ్దాల నుంచి సాహితీ సేవ చేస్తున్న పూర్ణ ప్రజ్ఞాచారిని జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ తెలిపారు. చిలకలూరిపేట శ్రీ సాయి టెక్నో స్కూల్ ఆవరణంలో ఈ నెల 28న పురస్కారం ప్రదానం చేయనున్నట్టు చెప్పారు.

# తెనాలి రోడ్డు విస్తరణతోనే ట్రాఫిక్ నియంత్రణ

- చేనేత భవనం నిర్మాణంతో మార్గం సుగమం
- దుకాణాలు తరలించి, విస్తరణ చేపట్టాలని కోరుతున్న ప్రజలు

మంగళగిరి: పట్టణ ప్రజలను ట్రాఫిక్ కష్టాల నుంచి తప్పించేందుకు అధికారులు రోడ్ల విస్తరణ చేపట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.23 కోట్లతో నగర ప్రధాన రహదారి గౌతమ బుద్ధా రోడ్డు విస్తరణ పూర్తిచేశారు. దీంతో పట్టణ ప్రజలకు కొంత మేర ట్రాఫిక్ కష్టాలు తీరాయి. ఇక ప్రధానంగా తెనాలి రోడ్డు విస్తరణతో పూర్తిగా ట్రాఫిక్ నియంత్రణ చేయవచ్చని భావించిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. మాస్టర్ ప్లానింగ్ ప్రకారం 60 అడుగులు విస్తరణకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా తెనాలి రోడ్డులోని 54 చేనేత దుకాణాలు తరలింపునకు పాత బస్టాండ్ ఆవరణలో రూ.7 కోట్లతో చేనత భవనాన్ని పూర్తిచేశారు. చేనేత దుకాణదారులను అందులోకి తరలించి తెనాలి రోడ్డు విస్తరణ చేపట్టారు. ఇంతలో 2024 సాధారణ ఎన్నికలు రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాటు మంగళగిరి ఎమ్మెల్యేగా నారా లోకేష్ విజయం సాధించారు. దీంతో తెనాలి రోడ్డు విస్తరణకు అధికారులు పాలకుల ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. పాలకులు, అధికారులు తెనాలి రోడ్డు విస్తరణతో పాటు షరాఫ్ బజార్, మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట గల రోడ్డు విస్తరించి, పట్టణ ప్రజలను ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కించాలని కోరుతున్నారు. దీంతో పట్టణాన్ని అభివృద్ధి పరచేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ కమిషనర్ అలీంబాషా మాట్లాడుతూ త్వరలోనే తెనాలి రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్ల విస్తరణతో పట్టణాన్ని అభివృద్ధి చేసి, మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు.



తెనాలి రోడ్డులోని చేనేత దుకాణాలు



పాత బస్టాండ్ ఆవరణలోని చేనేత భవనం

### స్థల వివాదంలో ఇరువర్గాలపై కేసులు నమోదు

మంగళగిరి: స్థల వివాదంలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసిన ఘటన చోటుచేసుకుంది. ఆదివారం పట్టణ సీఐ వినోద్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ వద్ద గల స్థల వివాదంలో సోనోవిజన్, ఖలీల్ భాయ్ హోటల్ మధ్య వివాదం కొనసాగుతోంది. సోనో విజన్ యజమాని భాస్కరమూర్తి, ఖలీల్ భాయ్ హోటల్ మేనేజర్ మచ్చా శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదులు మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి, తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

### స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తి

**పోలీసులు వైద్యశాలకు పంపగా మృతి**

తెనాలి రూరల్: రోడ్డుపై వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. అటుగా వెళుతున్న పోలీసు అధికారి చూసి కారు దిగి వచ్చి అతన్ని సిబ్బందితో వైద్యశాలకు పంపారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తెనాలి బస్టాండ్ ప్రాంతంలో ఉండే విజయకుమార్(68) వంట పనులకు వెళుతుంటాడు. ఆదివారం మధ్యాహ్నం కొత్త వంతెనపై నడుచుకుంటూ వెళుతుండగా స్పృహ తప్పి పడిపోయాడు. అటుగా వెళుతున్న డీఎస్పీ బి.జనార్ధనరావు చూసి వాహనం దిగి వచ్చి సిబ్బందితో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయినా, పోలీసుల ప్రయత్నం ఫలించలేదు. వైద్యశాలలో అతను మృతి చెందాడు. మృతుడికి కుటుంబ సభ్యులు ఎవరూ లేరని పోలీసులు చెప్పారు.

### సైబర్ నేరాలు, మోసాలపై అప్రమత్తత అవసరం

తెనాలి రూరల్: సైబర్ నేరాలు, మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి.జనార్ధనరావు ఆధ్వర్యంలో వారధి కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి స్థానిక ఫుడ్ గ్రెయిన్స్ అండ్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ హాలులో పోలీసులు నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఓటీపీ, ఈకేవైసీ మోసాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి వాటిపై వీడియో రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు, టూ టౌన్ సీఐ నిస్సార్ బాషా, రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు, పలువురు వ్యాపారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

# రామచంద్రరావు సేవలు అభినందనీయం

తెనాలి అర్బన్: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ రేపల్లెకు బదిలీ అయిన ఆకురాతి రామచంద్రరావు అభినందన సభను ఆదివారం మారీసుపేటలో ఫెంటాస్టిక్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో రామచంద్రరావు బాధ్యతతో వ్యవహరిస్తూ అధికారుల మన్ననలను పొందారని తెలిపారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గాజుల మోహన్, గోపాళం శ్రీనివాసరావు, గాజుల విజయసారథి, గాజుల శ్రీనివాస్, తోటకూర చిట్టిబాబు, విష్ణుమొలకల శ్యాం సుందర్, తాడికొండ చిన్నబ్బాయి పాల్గొన్నారు.



రామచంద్రరావును సన్మానిస్తున్న ఫెంటాస్టిక్ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు.

# ప్రగతి పథంలో కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ

**సర్వసభ్య సమావేశంలో చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు**

తెనాలి: కాకతీయ మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, తెనాలి 23వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఏర్పాటైన సమావేశానికి సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షత వహించారు. సొసైటీ సీఈవో కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి వార్షిక నివేదికను సమర్పించారు. సభ్యులు, ప్రజల సహకారం, ఆదరణతో సొసైటీ పురోగమిస్తోందని లక్ష్మీకాంతారావు వెల్లడించారు. సొసైటీ తరపున సిక్త్ సిగ్మా చెస్ అకాడమీ ఛాంపియన్‌షిప్‌లో విజేతలైన చిన్నారులకు నగదు బహుమతులు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు, సభ్యులు చైర్మన్ లక్ష్మీకాంతారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, దావులూరి చక్రధర చౌదరి పాల్గొన్నారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాల్ని ప్రదర్శించారు.



లక్ష్మీకాంతారావును సత్కరిస్తున్న డైరెక్టర్లు

### ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

కొల్లిపర: మండలంలోని వల్లభాపురం, అత్తలూరి పాలెం గ్రామాల్లో ఎస్ఐ పి.కోటేశ్వరరావు శనివారం రాత్రి సిబ్బందితో కలసి గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తలూరి గ్రా మంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రా క్టర్‌ను గుర్తించారు. డ్రైవర్‌వద్ద ఎటువంటి ప త్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి, ట్రాక్టర్‌ను రెవెన్యూ అధి కారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.